ఎవరి అంచనాలు వారివే!

మెజార్టీపై మూడు పార్టీల ధీమా

మణికొండ: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో జరిగిన పోలింగ్ సరళిని బట్టి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఎవరి అంచనాలు వారు వేస్తున్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కువగా ఎవరికి మొగ్గు చూపారనే ఆలోచనలో పడ్డారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసిన అత్యధిక మైనార్టీలు ఈసారి ఓటింగ్‌లో అధికంగా పాల్గొనకపోవటం, కొంతమంది హైదరాబాద్ ఎంపీ పరిధిలో ఓటు వేసేందుకు వెళ్లడంతో వారికి ఆ ఓట్లు తగ్గుతాయని అంచనాకు వచ్చారు. మైనార్టీ ఓటర్లు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటు వేసేందుకు ఎక్కువగా వెళ్లడం, స్థానికంగా ఉన్న ప్రజల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇస్తున్న ఉచిత బియ్యం, దేశాభివృద్ధి , ప్రపంచ దేశాల్లో మన దేశానికి పెరిగిన పరపతిని దృష్టిలో ఉంచుకుని బీజేపీకి ఓట్లు ఎక్కువగా పడ్డాయని బీజేపీ నాయకులు అభి ప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఉత్తర భారతానికి చెందిన ఓటర్లు బీజేపీకే ఓటు వేశారని వారు పేర్కొంటున్నారు. దీంతో తమకే మెజార్టీ వస్తుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ విషయానికి వస్తే బీసీ నాయకుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ఎంపీ అభ్యర్థిగా ఉండటం, గత దశాబ్దకాలంగా హైదరాబాద్ నగర అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ ఎంతో కృషి చేయటం, స్థానికంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఉండటం తమకే కలిసి వస్తుందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలకు కట్టుబడి ఉందని ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలుపుతున్నారు. గత ఎన్నికల్లో బీఆఆర్ఎస్ వైపు ఉన్న మైనార్టీలు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు మొగ్గారని, ఎన్నికల కోడ్ రావటంతోనే సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు కాలేదనే విషయాన్ని ప్రజలు గమనించారని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు.

ఎన్నికల ప్రక్రియ పూర్తి మిగిలిన వాటిని అమలు చేస్తారని, ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన సానుకూల ఫలితం ఇచ్చిందంటున్నారు. నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీలలో కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారని, వారి బలంతో ఈ సారి అన్ని మున్సిపాలిటీలలో మెజార్టీ ఓట్లు సా ధిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరు ఎలాంటి వాదనలు చేస్తున్నా జూన్ 4వ తేదీన వెలువడే ఫలితాల తరువాతనే ఎవరి బలాలు ఎంత అనే విషయం తేలుతుందని సామాన్యులు చర్చించుకుంటున్నారు.

సమీక్షలతో బిజీబిజీగా...

రాజేంద్రనగర్: పోలింగ్ సరళి ముగియడంతో వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం గెలుపు ఓటములపై అంచనాలు వేస్తున్నారు. తమతమ ప్రాంతాల్లో జరిగిన పోలింగ్ సరళిని తమ అనుచరులతో వాకబు చేస్తూ ఎవరికి ఓటింగ్ శాతం ఎక్కువగా ఎవరికి పడిదంటూ సమాచారాన్ని సేకరించారు. దీంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అంచనాలు వేస్తూ బిజీబిజీగా మారారు. తమ వద్ద జరిగిన పోలింగ్ సరళిని సమీక్షించిన అనంతరం ఇతర ప్రాంతాల్లో జరిగిన ఓటింగ్‌ను తెలుసుకొని గెలుపుఓటములపై ఒక లెక్కలు వేసుకుంటున్నారు.

మెజార్టీ కాదు... గెలుపే...

గెలుపు, ఓటములపై పలువురు తమ తమ ప్రాంతాల్లో ఒక అంచనాకు వచ్చారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతాన్ని పర్యవేక్షించిన అనంతరం విజయంపై ఒక అవగాహనకు వచ్చారు. గతంలో లక్షల మెజార్టీ వస్తాదని అంచనా వేసుకున్న ఆయా పార్టీల నాయకులు స్వల్ప మెజార్టీతోనే గెలుస్తామనే ధీమాలో ఉన్నారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు

చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి



అత్తాపూర్: తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ జరిగిందని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డి అన్నారు. ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించిన ఎన్నికల కమిషనర్, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులతోపా టు మున్సిపల్ సిబ్బందికి ప్రజలకు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందు లు జరగకుండా సహకరించిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ అధ్యక్షు లు సాబాద విజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కకుళారం కృష్ణ, జయానంద్‌రెడ్డి, అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయి యాదవ్, యువమోర్చా అధ్యక్షులు మ జీకంత తదితరులున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్: ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పిడమర్తి రవి పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి, అంబేడ్కర్ చౌరస్తా వద్ద జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్ (మిట్టు) ఆధ్వర్యంలో పండ్లు అందజేయడంతో పాటు కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీబీ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

17న టీఎఫ్ఎంసీ 10వ వార్షికోత్సవం

టీఎఫ్ఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ



మణికొండ: తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ 10వ జాతీయ ఫెసిలిటీస్ మేనేజర్స్ సమ్మిట్-2024ను ఈనెల 17వ తేదీన నగర శివారు నార్సింగిలోని అడ్రస్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు సత్యనారాయణ మతాల ఒక ప్రకటనలో తెలి పారు. ఈ సమ్మిట్ భవిష్యత్ సాంకేతికత, ప్రతి ఫెసిలిటీ మేనేజర్ రాబోయే 10 సంవత్సరాలలో ఉపయోగించే ఏఐ పద్ధతులపై దృష్టి పెడుతుందన్నారు. ఈ సమ్మిట్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌లు హాజరవుతారన్నారు. ఇది గ్రీన్, స్థిరమైన కార్యక్రమాలను ప్రో త్సహించే గ్రీన్ సమ్మిట్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. సమ్మిట్ అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐటీ పార్కులు, కమ్యూనిటీలలో ఉత్తమ, స్థిరమైన అభ్యాసాలకు అవార్డులను అందజేస్తామన్నారు.

హెచ్‌కేఎం ఫౌండేషన్‌కు
విద్యుత్ వాహనం విరాళం



విద్యుత్ వాహనాన్ని అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మణికొండ: నిరుపేదలకు ఆహారం అందిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ (అక్షయపాత్ర) ఫౌండేషన్‌కు సావరియ పైప్స్ సంస్థ రూ.16.5లక్షల విలువైన విద్యుత్ వాహనాన్ని మంగళవారం అందించారు. సమాజంలో వెనకబడిన వర్గాలకు ఆహారాన్ని అందించటానికి ఫౌండేషన్ చేస్తున్న కృషికి తమ వంతు సహకారాన్ని అందించేందుకు ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సొల్యూషన్స్‌లో అగ్రగామి సంస్థ సావరియ పైప్స్ సంస్థ ముందుకు రావటం అభినందనీయమని హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభుజీ అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఉపయోగపడటంతోపాటు 1700 కేజీల బరువు మోయగల సామర్థ్యం ఉన్న విద్యుత్ వాహనాన్ని అందించటం శుభ పరిణామన్నారు. సమాజానికి తమ వంతు తిరిగి ఇవ్వాలనే ఒరవడిలో భాగంగానే కొంత ఇలాంటి కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్నామని సావరీయ పైప్స్ సంస్థ ఎండీ సుజిత్ అగర్వాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల్లో నైపుణ్యత పెంపుతో
జీవన ప్రమాణాలు మెరుగు

ఎస్ఓఎస్ సంస్థ సీఈఓ సుమంతకర్



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ సుమంతకర్

మణికొండ: మహిళలకు మరిన్ని నైపుణ్యాలను నేర్పి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతో ఉందని, అందుకు తమ ఎస్ఓఎస్ సంస్థ పలు సంస్థలతో కలిసి కృషి చే స్తుందని సీఈఓ సుమంతకర్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి శివారులోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో మంగళవారం స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సంహకారంతో ఇంటర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రా మీణ ప్రాంతాలలోని మహిళల నైపుణ్యాలను మరింత మెరుగుపరిచి వారిని వ్యాపారులుగా తీర్చిదిద్దితే ఎంతో మేలు జరుగుతుందన్నారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డిప్యూటీ జనరల్ మేనేజర్ రామకృష్ణలు మాట్లాడు తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించి వారిని రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎస్ఓఎస్ బాలల కేంద్రం వారు మహిళలకు అనేక శిక్షణలు ఇస్తున్నారని, వారిని రాబోయే రోజుల్లో వ్యాపారులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్‌లీవుడ్ డైరెక్టర్ జిజిత్‌కుమార్, బాలల గ్రామం సంచాలకులు కొట్రేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మనూలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలు

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ మే 20

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ మంగళవారం తెలిపారు. ఏఐసీటీఈ సిఫార్సు చేసిన సిలబస్‌నే బోధిస్తున్నామన్నారు. ఏదైనా సబ్జెక్టులో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ప్రవేశ ఆధారిత ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి అర్హులని ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పణకు చివరి తేదీ మే 20గా నిర్ణయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఉర్దూ మాధ్యమంలో మెరిట్ ఆధారిత ఎంకామ్ కోర్సులో ప్రవేశాలను కూడా అందిస్తోందని, దీనికోసం దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీగా జూన్ 30గా నిర్ణయించామన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 65, బెండ 45, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 35, చామ 60, కీర 40, బీర 70, వంకాయ 40, గోకర 50, బీన్స్ 140, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 55, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 250.



సీసెల్ క్రాఫ్ట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



పోటరీ (మట్టి)తో తయారు చేసిన ఆకృతులను చూపిస్తున్న చిన్నారులు

చిన్నారులకు సమ్మర్ ఆర్ట్ క్యాంపు

శిల్పారామంలో 92 మంది విద్యార్థులకు శిక్షణ

వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం శిల్పారామం సమ్మర్ ఆర్ట్ క్యాంపును నిర్వహిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి 92 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. 17 రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్యాంపులో పోటరీ, పెన్సిల్ స్కెచ్, సీసెల్ క్రాఫ్ట్, మధుబని, ట్రైబల్ పెయింటింగ్, మండల పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్, సంస్కృతం, భగవద్గీత శ్లోకాలలో శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహిస్తే మరింత రాణించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సంస్కృతం నేర్చుకోవడం, భగవద్గీత శ్లోకాల విశిష్టత గురించి వివరిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా ఈ క్యాంపు ఈ నెల 17వ తేదీ వరకు ఉంటుంది.

– మాదాపూర్



పోటరీ అంటే చాలా ఇష్టం..



సమ్మర్ ఆర్ట్ క్యాంపులో మొదటిసారిగా శిక్షణ తీసుకుంటున్నాను. మట్టితో వివిధ రకాల ఆకృతులను తయారు చేస్తున్నాను. కుండలు, దీపం కుందులు, మట్టి గ్లాస్, పాత్రలు తయారు చేస్తున్నాను.

– మైరాశ్రీ, 2వ తరగతి విద్యార్థిని

సంస్కృతం, భగవద్గీత తప్పనిసరిగా నేర్చుకోవాలి



భగవద్గీత మానవ జీవన విధానాన్ని తెలుపుతుంది. భగవద్గీత శ్లోకాలు సంస్కృతంలో ఉంటాయి. ఆ భాషను నేర్చుకుంటే మిగిలిన అన్ని భాషలను సులువుగా నేర్చుకోవచ్చు. భగవద్గీత గురించి తెలుసుకుంటే మనిషి మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను చేరవచ్చు. లిప్పన్ ఆర్ట్, మండల పెయింటింగ్ నేర్చుకుంటే గృహిణులకు ఎంతో ఉపయోగం. ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది.

– లిప్పన్ ఆర్ట్ టీచర్ మైత్రేయి

పెయింటింగ్‌లో రాణిస్తా..

పెయింటింగ్ అంటే ఇష్టం. ట్రైబల్, మండల పెయింటింగ్‌లలో శిక్షణ తీసుకుని రాణిస్తే స్వయం ఉపాధి కలుగుతుంది. పెయింటింగ్ వేసేటప్పుడు మనస్సు, మెదడు చురుకుగా పనిచేస్తాయి.

– అశిక, 4వ తరగతి విద్యార్థిని

భారీ బందోబస్తు నడుమ ఈవీఎంల తరలింపు

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో మొత్తం 543 పోలింగ్ బూత్‌లకు చెందిన ఈవీఎంలను సోమవారం అర్ధరాత్రి భారీ పోలీసు బందోబస్తు మధ్య చేవెళ్లలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. పోలింగ్ అధికారుల నుంచి ఈవీఎంలను స్వాధీనం చేసుకున్న అధికారులు అనంతరం కంటైనర్లలలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగింది. కాగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 54.12 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 6,12,170 ఓటర్లు ఉండగా 3,31,318 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1,73,356 మంది పురుషులు, 1,57,959 మంది మహిళలు, ముగ్గురు ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు వెల్లడించారు.

'ఐఎఫ్‌ఎస్'కు ఎద్దిరెడ్డి వాసంతి ఎంపిక

హర్షం వ్యక్తం చేసిన హెచ్‌సీయూ ఫ్యాకల్టీ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని పెద్దిరెడ్డి వాసంతి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఆమె సివిల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్ విభాగంలో ఆలిండియా స్థాయిలో 50వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు మంగళవారం హెచ్‌సీయూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూలో ఆమె హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ బ్యాచ్ 2015–17లో ఎంబీఏ చేశారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కి ఎంపిక కావడం హెచ్‌సీయూకు గర్వకారణమని ఫ్యాకల్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.